క్లుప్తంగా

పీర్లస్వామి భూములను కాపాడండి



తుగ్గలి స్పందనలో అర్జీ ఇస్తున్న రాతన గ్రామస్తులు

తుగ్గలి: పీర్ల స్వామి భూములు అమ్మేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వాటిని అడ్డుకోవాలని మండల కో ఆ ఆప్షన్ సభ్యుడు చాంద్ బాషా, రాతన గ్రామస్తులు సోమవారం స్పందనలో తహసీల్దార్ రవికి అర్జీ ఇచ్చారు. గ్రామంలో పీర్ల స్వాములు అసేన్, ఉసేన్‌లకు సంబంధించి 3.90 ఎకరాలు ఉందన్నారు. అయితే ముజావర్లు ఆ భూములను అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్వామి భూములు అమ్మేందుకు వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

153 రేషన్ కార్డులు మంజూరు

మద్దికెర: మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి కొత్తగా 153 రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ నాగభూషణం సోమవారం తెలిపారు. కార్డులను త్వరలోనే రెవెన్యూ అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

వెల్దుర్తి తహసీల్దార్‌గా శివరాముడు



వెల్దుర్తి: స్థానిక తహసీల్దార్ రాజేశ్వరి సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం రిలీవ్ అయ్యారు. దాదాపు మూడేళ్లుగా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజేశ్వరి ఇటీవలి బదిలీలలో కృష్ణగిరికి నియమించబడ్డారు. రీసర్వే ఫలితంగా రిలీవ్ కావడానికి సమయం పట్టింది. ఆమె స్థానంలో నియమితులైన నంద్యాల జిల్లా ప్యాపిలి తహసీల్దార్ శివరాముడు మంగళవారం వెల్దుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల: మండలంలో తాగు, సాగు నీటి వసతి కల్పించి, ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో గోనెగండ్ల నుంచి పెద్దమరివీడు, గుల్లమొరుసు, చిన్నమరివీడు, కులుమాల, హెచ్.కైరవాడి తదితర గ్రామాల్లో జీపు జాత నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం ద్వారా మండల రైతాంగానికి సాగునీరు అందించడంతో పాటు దాహార్తి తీర్చాలన్నారు. అలాగే గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్ని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26 నుంచి 31వతేదీ వరకు చేపట్టనున్న మహాపాదయాత్రలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు కరుణాకర్, దండుఖాజా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రంతోపాటు అల్లుగుండు, మల్లెపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, వెంకటాపురం, నార్లాపురం, రత్నపల్ల, బోయనపల్లె, నర్సాపురం, సర్పరాజాపురం, రామళ్లకోట, పుల్లగుమ్మి, కలుగొట్ల గ్రామాలలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జీపుజాత నిర్వహించారు. ఆయా గ్రామాలలో సమస్యలను గుర్తించడంతోపాటు వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి చేపట్టాలని ఆ పార్టీ జిల్లా నాయకులు నగేశ్, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

'స్పందన' అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

నందవరం: స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్పందన అర్జీలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. మన బడి నాడు– నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఆర్ఐ జెర్మియా, సీహెచ్ఓ బలరాం, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మి నారాయణ సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీడీఓ కొండయ్య, ఏపీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: మండల కేంద్రంతోపాటు బోయనపల్లె గ్రామంలో సోమవారం స్థానిక, సెబ్ పోలీసులు సంయుక్తగా జరిపిన దాడులలో ముగ్గురు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వెల్దుర్తికి చెందిన నాయుడు, రాములు వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా, బోయనపల్లెకు చెందిన లక్ష్మీదేవి నుంచి 15 లీటర్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సేవామూర్తులు వలంటీర్లు

- సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే చేరవేస్తున్న సారథులు
- కరోనా విపత్తు వేళ ప్రాణాలకు తెగించి సేవలు
- ఆస్పత్రులకు వెళ్లి మరీ పింఛన్లు అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు, ప్రజలు



తెల్లవారుజామున వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ భాగ్యమ్మ (ఫైల్)



కోవిడ్ సమయంలో ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్లు మారెప్ప, సృజన్ (ఫైల్)

ఆలూరు రూరల్: వలంటీర్ వ్యవస్థ సేవకు పర్యాయ పదంగా మారింది. వీరి సేవలను రాష్ట్రం మాత్రమే కాదు.. దేశం మొత్తం మెచ్చుకుంటోంది. కరోనా విపత్తు వేళ వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. కోవిడ్ నియంత్రణలో ప్రాణలను ఫణంగా పెట్టి సేవలందించింది. కరోనా సోకిన వారిని కుటుంబసభ్యులు విస్మరించినా తామున్నామంటూ వలంటీర్లు నిషేధిత ప్రాంతాలకు వెళ్లి మందులు, పౌష్టికాహారం అందించి ఎంతో మంది ఊపిరి నిలిపారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తూ వారధుల్లా పనిచేస్తున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు

ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తమ పరిధిలోని ప్రతి కుటుంబ వివరాలు సేకరించి, వారికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేసి అర్హులైన వారికి లబ్ధి చేకూరుస్తున్నారు. ఆ వీధికి వైద్య సేవలు, రేషన్ పంపిణీ వాహనం ఏ సమయంలో వస్తుందో ముందుగానే సమాచారం ఇస్తున్నారు. బీమా పథకంలో అర్హులను చేర్పించి, వారి కుటుంబాల్లో భద్రత నింపే బాధ్యత సైతం తీసుకున్నారు. కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజీ సర్టిఫికెట్, కొత్త రేషన్ కార్డు ఇప్పించడం, ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయడం, ఇళ్లు లేని పేదలను గుర్తించి, పక్కా గృహాలకు దరఖాస్తు చేయిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్‌దారులకు ఇళ్లవద్దకే వెళ్లి, అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి వందల కి.మీ ప్రయాణించి మరీ నగదు అందించి ఆర్థిక భరోసా నింపుతున్నారు. రైతు భరోసా, పిల్లలకు అమ్మ ఒడి వంటి పథకాల అందేలా చూడడంలో వీరి పాత్ర ప్రధానం. ప్రభుత్వం నుంచి అందించే రాయితీలు తెలియజేసి కీలక భూమిక పోషిస్తున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏటా వారికి పురస్కారాలు అందించి గౌరవిస్తోంది.

కరోనా విపత్తులోనూ పింఛన్ తెచ్చి ఇచ్చారు



నాకు వితంతు పింఛన్ వస్తోంది. మూడేళ్ల క్రితం కరోనా బారిన పడ్డాను. ఊరంతా బంద్ చేశారు. కూలీ పనికి వెళితేనే కుటుంబం గడుస్తుంది. పింఛన్ వస్తే నా మందులు, ఇంటి ఖర్చు జరిగేవి. ఇరుగుపొరుగు వారు 'ఇంక యా పింఛన్ ఇస్తారు. ఎవరూ బయట తిరిగేదు లేదు. వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తాడా' అని మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో ఒకటో తేదీ రాగానే ఉదయం 6 గంటలకు అక్కా అని పిలుపు.. ఎవరని తలుపుతీస్తే వలంటీర్. వేలు వత్తేది లేదు. ఫొటో తీస్తా.. అని చెప్పి పింఛన్ డబ్బులు ఇచ్చిపోయాడు. కష్టకాలంలో పింఛన్ డబ్బు ఎంతగానో ఉపయోగపడింది.

– ఫాతిమా, ఆలూరు

సేవలను వెలకట్టలేం



నా పేరు మల్లికార్జున నాయక్. నాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వికలాంగ పింఛన్ రూ.3 వేలు అందిస్తోంది. గతంలో పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిరగడం చాలా ఇబ్బందిగా ఉండేది. వలంటీర్ వ్యవస్థ వచ్చాక మా వలంటీర్ అహ్మద్ ప్రతి నెలా తెల్లారకముందే ఇంటి వద్దకే నగదు తెచ్చి ఇస్తున్నాడు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నాడు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.

– మల్లికార్జున నాయక్, ఆలూరు

వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు సముచిత స్థానం



జొన్నగిరిలో ఎమ్మెల్సీ మధుసూదన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తుగ్గలి: వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు సముచిత స్థానం సాధ్యమైందని ఎమ్మెల్సీ మధుసూదన్ అన్నారు. సోమవారం ఆదోని నుంచి అనంతపురం వెళుతున్న ఆయన్ను జొన్నగిరిలో పార్టీ నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు గుంత రఘు, ఆంజినేయులు, వైస్ ఎంపీపీ నాగప్పయాదవ్, లోకనాథ రెడ్డి తదితరులు పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నగేష్

మద్దికెర: సీజనల్ వ్యాధులు, వాతావరణ మార్పులపై అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నగేష్ సూచించారు. స్థానిక హరిజనవాడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, అతిసారం వంటి వ్యాధులను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని నీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత తాగాలన్నారు. మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సిబ్బంది సరస్వతి, కృష్ణమ్మ, సూర్య నారాయణ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: గ్రామాల్లో ప్రజలతో మమేకమై విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.సురేష్ సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎవ్వరి సచివాలయాల పరిధిలో వారు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడాలన్నారు. ముఖ్యంగా మహిళలతో కలిసి మాట్లాడటం వల్ల వారి సమస్యలు తెలుస్తాయన్నారు. దిశ యాప్ గురించి అవగాహన కల్పించి మహిళలు, యువతుల ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించాలన్నారు. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగితే వెంటనే తమకు సమాచారం అందించి పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

చిప్పగిరి: మండలంలోని నంచర్ల, దౌల్తాపురం తదితర గ్రామాల్లోని ఎంపీయూపీ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంఈఓ బాలనాయుడు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం, పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, నాడు–నేడు పనులు, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు వినోద్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

మద్దికెర: స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి పల్లా ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు గంగపూజ, గణపతి పూజ, అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. తీర్థప్రసాద వినియోగం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త పెద్దకోట్ల రమేష్, అర్చకులు ఆంజనేయులు, కమిటీ సభ్యులు వెంకటప్ప, పల్లా పాండురాజు, బాణా ఎర్రిస్వామి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో అమావాస్య పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పంటల బీమా వర్తింపజేయాలి

ఆస్పరి: 2022 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులందరికీ బీమా వర్తింపచేయాలని రైతు సంఘం నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి, ఉరుకుందప్ప తదితరులు సోమవారం వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు పంటల బీమా నమోదును తప్పుల తడకగా చేపట్టారని ఆరోపించారు. విచారణ చేపట్టి నష్టపోయిన రైతులకు బీమా వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీజీ సెట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి

ఆలూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ పీజీ సెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. అర్థ శాస్త్ర విభాగం నుంచి టి.రాజేశ్వరి 45వ ర్యాంకు, ఎం.మహేశ్వరి 164వ ర్యాంకు, సి.మధు 246వ ర్యాంకు, టి.మౌనిక 654వ ర్యాంకును సాధించారు. అలాగే రాజనీతి శాస్త్ర విభాగంలో బి.ఐశ్వర్య 175వ ర్యాంకు, మంజువాణి 227వ ర్యాంకు, ఏపీ ఎడ్‌సెట్‌లో సి.పులిశేఖర్ 1702వ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

కృష్ణగిరి: పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వ్యవసాయంలో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. గ్రామాల్లోని ఆర్బీకేల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పొందాలన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి



పత్తికొండలో ఆందోళన చేస్తున్న విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

పత్తికొండ రూరల్: హిందూ మనోభావాలు దెబ్బతీసేలా దేవాలయంపై ఓ వ్యక్తి నిర్మించిన అక్రమ కట్టడాన్ని వెంటనే తొలగించాలని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు రంగాగౌడ్, కరణం నరేష్, వీరరాజు మాట్లాడుతూ.. పురాతన ఆంజనేయస్వామి ఆలయంపై ఓ వ్యక్తి అక్రమంగా ఇంటిని నిర్మించేందుకు పూనుకోవడం తగదన్నారు. అక్రమ కట్టడానికి అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అఖిలపక్ష నాయకులు రామచంద్రయ్య, అశోక్‌కుమార్, నరసింహులు, రామాంజినేయులు తదితరులు దేవాలయంపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని పరిశీలించారు. మతపరమైన అంశాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ చొరవ చూపించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిరుపేదలకు భూ పంపిణీ

తుగ్గలి: మండలంలో 232 మంది రైతులకు 298.6 ఎకరాలు భూ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవి సోమవారం తెలిపారు. సాగులో ఉన్న భూములకు పట్టాలు కావాలని రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయా భూములను కొలతలు వేసి రికార్డులు సిద్ధం చేశామన్నారు. త్వరలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఆలూరు: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ కోమలా దేవి, ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి సూచించారు. సోమవారం ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎంఈఓ కోమలాదేవి మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లలను, మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే పచ్చదనాన్ని పెంచేందుకు పాఠశాలలో మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నందవరం: పల్లెల్లో గుట్కా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని గంగవరం గ్రామ శివారు జొహరాపురం రోడ్డులో కంపచెట్ల మధ్య పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 4,400 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విద్యాశాఖ అనుమతి లేకుండా భాభాష్యం పాఠశాల రెండవ బ్రాంచ్‌ను ప్రారంభించడంతో పలు విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ముందు ధర్నా చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కె.ఆంజినేయులుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఎంఈఓ ఎం.ఆంజనేయులు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. తగిన అనుమతి లేకపోవడంతో రెండవ బ్రాంచ్‌గా ఏర్పాటు లేదా పాఠశాల తరలింపు వంటివి చేయరాదని యాజమాన్యానికి సూచించారు. అనుమతి లేని బ్రాంచ్‌ను మూసివేయాలని ఆదేశించారు.

ఓటీఎస్‌తో విలువైన ఆస్తి సొంతమైంది



ఓటీఎస్ కింద ఇంటికి శాశ్వత హక్కు పత్రాలు అందించేందుకు వివరాలు సేకరిస్తున్న వలంటీర్లు

ఈ చిత్రంలో వలంటీర్లు వివరాలు సేకరిస్తున్న మహిళ పేరు ఆకుల ఉచ్చీరమ్మ. 2008లో ఈమెకు ఇందిరమ్మ హౌసింగ్ లోన్ కింద రూ.60 వేలు మంజూరు కావడంతో మరికొంత నగదు కలుపుకుని సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వానికి పడ్డ బకాయిని ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) తో రూ.10 వేలు చెల్లిస్తే మొత్తం రుణం మాఫీ చేయించడంతో పాటు ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఆ సమయంలో వలంటీర్ విజయ్ ఆమె ఇంటికి వెళ్లి ఓటీఎస్ గురించి వివరించాడు. దరఖాస్తు చేయించి, సబంధించిన జిరాక్సులు తీసుకుని సచివాలయంలో ఓటీఎస్ పథకం కింద నమోదు చేయించి ఆ ఇంటిని ఉచ్చీరమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. వలంటీర్ చొరవతో రూ.10 లక్షల విలువైన ఆస్తి సొంతం కావడంతో వారి ఆనందానికి హద్దుల్లేవు.

–ఆలూరు రూరల్

వలంటీర్ చెప్పడంతోనే తెలిసింది



నేను గత 15 ఏళ్ల క్రితం ఇల్లు కట్టుకునేందుకు హౌసింగ్ నుంచి రూ.60 వేలు లోన్ తీసుకున్నాను. గతంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల రుణం చెల్లించలేకపోయాం. బకాయి అలాగే ఉండిపోయింది. ఒక రోజు వలంటీర్ విజయ్ మా ఇంటికి వచ్చి ఓటీఎస్ కింద రూ.10 కడితే రుణం మొత్తం మాఫీ అవుతుందని, ఇల్లు కూడా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారని చెప్పాడు. ఈ మేరకు దరఖాస్తు చేయించి రుణ విముక్తి పత్రాలతో పాటూ ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. వలంటీర్ చెప్పడంతోనే రూ.10 లక్షలు విలువైన ఆస్తి సొంతమైంది. లేదంటే మాలాంటోళ్లకి ఇలాంటి పథకాల గుర్తించి తెలిసేది కాదు. – ఉచ్చీరమ్మ, ఆలూరు

శభాష్ వీరన్న



ఆస్పరి మండలం జొహరాపురంలో గంగన్నకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వీరన్న

ఈ చిత్రంలో ఫించన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్ వీరన్న తన సేవలతో అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. వీరన్నది ఆస్పరి మండలం జొహరాపురం గ్రామం. బీఏ బీఈడీ చదివారు. దివ్యాంగుడైన వీరన్న మూడు చక్రాల సైకిల్‌పై తనకు కేటాయించిన 50 ఇళ్లకూ తిరుగుతూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఇటీవల 8 మంది అర్హులకు కొత్తగా వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయించాడు. కరోనా సమయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన వెయ్యి రూపాయల ఆర్థిక సహాయం ఇంటింటికీ తిరిగి అందజేశారు. తనకు కేటాయించిన పరిధిలో వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగిన వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతోపాటు వారిచేత దరఖాస్తు చేయించి లబ్ధి పొందేలా కృషి చేస్తున్నాడు.

–ఆస్పరి

పింఛన్ మంజూరు చేయించాడు

దివ్యాంగుడైన వలంటీర్ వీరన్న ట్రైసైకిల్‌పై తిరుగుతూ చురుగ్గా పనిచేస్తున్నాడు. నిబంధనల ప్రకారం నాకు అర్హత లభించడంతో తగిన ధ్రువపత్రాలు తీసుకుని ఇటీవలే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయించాడు. 1వ తేదీ తెల్లవారుజామునే ట్రైసైకిల్‌పై పింఛన్ డబ్బులు అందిస్తున్నాడు. వృద్ధాప్యంలో ఉన్న నాకు ఈ నగదు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గంగన్న, జొహరాపురం, ఆస్పరి మండలం

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



ఎమ్మిగనూరు 25వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు ఇన్‌చార్జ్ కేఎస్ శివన్నలతో కలిసి పట్టణంలోని 25వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలోని ఎస్ఎంటీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను తగిన ప్రణాళికతో చేపడుతున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నజీర్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్, యూకే వీరేంద్ర, శివప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, బంగి శ్రీరాం, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ పద్మమ్మ, నాయకులు హనుమంతు, మాధవస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



పత్తికొండలో క్రీడాదుస్తులు అందిస్తున్న రేమట మధుకేశవ రెడ్డి

పత్తికొండ రూరల్: ప్రతిభ గల క్రీడాకారులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తానని ఎన్ఆర్ఐ తువ్వదొడ్డి రేమట మధుకేశవ రెడ్డి అన్నారు. సోమవారం కోవాంటెక్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో 102 మందికి క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. అలాగే రూ.లక్ష వెచ్చించి ఆస్ట్రోటర్ఫ్ పిచ్‌ను ఏర్పాటు చేశారు. క్రికెట్‌పై మమకారంతో పాటు పేద క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ముబినా, లాస్యలహరి, కోచ్ సుంకన్నను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నీలకంఠ, పీడీలు చందునాయక్, రాజేష్, వేణుగోపాల్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

వెల్దుర్తి: ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో చిన్నచిన్న సమస్యలపై ఫిర్యాదులు రావడంతో అసహనం వ్యక్తం చేశారు. డెత్, బర్త్ సర్టిఫికెట్లు కూడా సరైన సమయంలో మంజూరు చేయలేకపోవడం ఏమిటని ఆగ్రహించారు. స్థానిక ఏబీఎం పాఠశాలలో ఒకే టీచర్ ఉండడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిందని, 1వ తరగతిలో తమ పిల్లలను చేర్చుకోవడంలేదని పలువురు తల్లిదండ్రులు తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ మండల పరిధిలో సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక గీతానగర్‌లోని శ్రీగాయత్రి దేవాలయంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఈనెల 7వ తేదీన దేవాలయంలో దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి మరోసారి ఆలయంలో కిటికీ వద్ద ఏర్పాటు చేసిన హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఆలయ తలుపు తెరచుకోకపోవడంతో హుండీని పగలగొడుతుండగా శబ్దాలు విని ఇరుగుపొరుగు వారు రావడం గమనించి దొంగలు పరారయ్యాయి. వారం రోజుల వ్యవధిలో ఆలయంలో రెండుసార్లు దొంగలు పడటంతో భక్తులు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

పీఎం కిసాన్‌కు ఈ–కేవైసీ తప్పనిసరి

తుగ్గలి: పీఎం కిసాన్ పథకం ద్వారా 14వ విడత లబ్ధి పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని ఏఓ పవన్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా మొత్తం 16,183 పీఎం కిసాన్ ఖాతాలు ఉండగా ఇంకా 1005 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేదన్నారు. ఒకసారి అర్హుల జాబి తా నుంచి పేర్లు తొలగిపోతే తిరిగిచేర్చడం కష్టమని పేర్కొన్నారు. రైతులు మీ సేవా లేదా కామన్ సర్వీస్(సీఎస్‌సీ), ఆర్బీకే అసిస్టెంట్లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలోనూ స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.